జాతీయ తెలుగు దినపత్రిక


# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

ఖమ్మం

బుధవారం 6

నవంబర్ 2024

## వైద్య విభాగం ద్వారా రోగులకు సమర్థవంతమైన సేవలు అందాలి




- అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ
- పి.హెచ్.సి లో అందుబాటులో ఉన్న డ్రగ్స్ (మందుల)
- వివరాలతో బోర్డు ఏర్పాటు
- బయోమెట్రిక్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు
- గర్భిణీ మహిళల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పై దృష్టి సారించాలి
- వైద్య ఆరోగ్య శాఖపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైద్య విభాగం ద్వారా రోగులకు సమర్థవంతమైన సేవలు అందాలని, ఆ దిశగా జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 26 పి.హెచ్.సి. లు, 4 అర్బన్ పి.హెచ్.సి. లలో అందుబాటులో ఉన్న మందుల వివరాలతో బోర్డులను రేపటి వరకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## సమంత బంకర్ కట్టడంలో జరిగిన అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలి

**సత్తుపల్లి నవంబర్5 ప్రజా జ్యోతి.**

సింగరేణిలో అవినీతి విలయతాండం చేస్తుందనటానికి,సత్తుపల్లి లోని జేవియర్ ఓసి కి సంబంధించిన బంకర్ కట్టడంలో జరిగిన అవినీతి అందుకు నిదర్శనమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె బి సి సి ఐ మందా నరసింహారావు అన్నారు.దాదాపు 400 కోట్లకు పైగా హెచ్చించి, బంకర్ నిర్మాణంలో అనేక అవకతవకలకు దారి తీయడం వల్ల,నాణ్యత లోపంతో,నిర్మాణాలు చేపట్టడం వల్ల,నిత్యం రిపేర్లకు గురవుతున్నాయని, అంతేకాకుండా నిర్మాణ స్థలం నిర్ణయంలో కూడా లోపబోయిష్టంగా జరిగిందని, అందువల్ల కిష్టారం గ్రామంలోని ప్రజలు బంకర్ నుండి వచ్చే డస్ట్ వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. మంగళవారం జి.వి.ఆర్ ఓసి లో సమావేశంలో పాల్గొన్నారు. నిత్యం రిపేర్ ల వల్ల సమంతా బంకర్లు,కంపెనీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, వాస్తవంగా ఈ బంకర్ ని ప్రస్తుతం నడుస్తున్న ఓసీటుకి అందుబాటులో లేకుండా,రెండు కిలోమీటర్ల దూరం లో నిర్మించడం వల్ల రాబోయే కాలంలో ఈ బంకరు కు బొగ్గు పంపించటానికి,ఇంకా అనేక కోట్ల రూపాయల హెచ్చించి, బొగ్గు రవాణా చేయడానికి బెల్టుతో సహా ఇతర పరికరాలు ఏర్పాటు చేయాల్సిన వస్తున్నదని ఆయన పేర్కొన్నారు.అలాగే సింగరేణిలో యంత్రాలు గంటల తరబడి రిపేర్లకు గురవుతున్నాయని, సరియైన స్పేర్ పార్ట్స్ కొనటంలో కూడా కంపెనీ జాప్యం చేస్తున్నదని, తద్వారా యంత్రాల పని గంటల వినియోగంలో సరియైన పద్ధతిలో



ఉపయోగానికి, నిరుపయోగంగా ఉన్నాయని సింగరేణి వ్యాపితంగా ఈ పరిస్థితి నెలకొన్నదని,సరైన యంత్రాలు కూడా కొనుగోలుకు సరిపడా ఆర్థిక స్తోమత లేక పాత వాటిని ఉపయోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీరాంపూర్ లో ప్రైవేట్ ఎమ్మారై స్కానింగ్ ఏర్పాటు చేయడానికి కారణం కూడా కొంతమంది అధికారుల లాభాపేక్ష తప్ప కార్మికులకు ఒరిగిందేమీ ఉండదని, కంపెనీకి కూడా ప్రైవేట్ ఎమ్మారై స్కానింగ్ మిషన్ వల్ల నష్టమే తప్ప లాభం లేదని,గతంలో సిఐటిని పూర్తిగా వ్యతిరేకించిన మళ్లీ అదే పని కంపెనీ చేయటం సరైనది కాదని ఆయన అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు




- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్
- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దొడ్డు, సన్న రకం ధాన్యం గుర్తింపుపై అధికారులకు శిక్షణ
- సన్న రకం ధాన్యం బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే దక్కేలా చూడాలి
- ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి

# కొలాబెరా కంపెనీకు 28 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి : స్థానిక యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ బహుళజాతి కంపెనీ కొలాబెరా వారు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో అర్హులైన 120 మంది సి.యస్.సి., ఈ.సి.ఈ విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎనలిస్ట్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు 6 నెలల శిక్షణా కాలంలో 3 లక్షల రూపాయలు లభిస్తుందని, శిక్షణ అనంతరం హెచ్.సి.ఎల్.కు అర్హత సాధించిన వారికి 4 లక్షల రూపాయలు వార్షిక ఆదాయంగా అందుతుందని వారు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు విద్యార్జన తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎల్లప్పుడు అగ్రగామిగా ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు అకాడమిక్ తరగతులతో పాటు వారికి శిక్షణ కోసం వివిధ కంపెనీల ద్వారా క్లౌడ్ కంప్యూటింగ్, సిస్కో నెట్వర్కింగ్, పైథాన్ ట్రెనింగ్, ఎ.డబ్ల్యు.యస్., సర్టిఫికేషన్ మొదలైన వాటిలో శిక్షణ ఇప్పించడం జరుగుతుంది అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారానే కళాశాల గత కొన్ని సంవత్సరాలుగా 275, 294 మరియు 400 పై చిలుకు నియామకాలతో జిల్లాలోనే అగ్రగామిగా కొనసాగుతుందని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి మాట్లాడుతూ విద్యార్థులకు సరైన శిక్షణ అందించటానికి ఇన్ఫోసిస్, ఐసిటి అకాడమి, టాస్క్ కోడతంత్ర తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని అన్నారు.కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు 'లెర్నింగ్ బై డూయింగ్' అనే నినాదంతో విద్యతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేటట్లుగా వారికి సరైన రీతిలో శిక్షణ అందించడానికి కళాశాల ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని ఉజ్వల భవిష్యత్తు ఏర్పరుచుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొలబెరా కంపెనీ ప్రతినిధి సోను త్యాగి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్స్, జి. ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? యన్. శ్రీనివాసరావు, డా? జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా ప్రత్తి రైతుల సమస్యలపై ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఆందోళన నిర్వహించిన బిఆర్ఎస్ జిల్లా శ్రేణులు



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

అనంతరం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ తో సమావేశమై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టవలసిందిగా డిమాండ్ చేసిన ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్.జె.సి కృష్ణ మరియు ఇతర నాయకులుఅనంతరం బిఆర్ఎస్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ కు ఈ క్రింది అంశాలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ప్రస్తుతం సీజన్ లో పత్తి రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. పత్తి రైతులు తమ పంటను సరైన ధరకు అమ్ముకోలేకపోతున్నారు. CCI (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు మార్కెట్లో అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు కనీస మద్దతు ధర (MSP) పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పత్తి రైతుల సంక్షేమం దృష్ట్యా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నందు CCI కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.అకాల వర్షాలు, తుఫాన్లు మరియు ఇతర వైపరీత్యాలవల్ల రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన పత్తి రైతులను వెంటనే ఆదుకోవాలి. నష్టపోయిన ప్రత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరకు అదనంగా క్వింటాల్ కు 1000 రూపాయల బోనస్ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి.జాతీయ వ్యవసాయ విధానం (E-NAM) ను అన్ని వ్యవసాయ మార్కెట్లలో తక్షణం అమలు చెయ్యాలి.రైతుల సౌకర్యార్థం గతంలో మాదిరిగా సబ్సిడీ క్యాంటీన్ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నందు పునరుద్ధరించాలి.సీసీఐ కేంద్రం నిర్వహిస్తున్న జిన్నింగ్ మిల్స్ పై విచారణ చేపట్టాలి.సమస్యలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు చేపడతానని బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందానికి హామీ ఇచ్చారు.ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్.జె.సి కృష్ణ , ముదిగొండ మాజీ ఎంపిపి సామినేని హరిప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వీరు నాయక్, బాషబోయిన వీరన్న, స్థానిక కార్పొరేటర్లు తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, పసుమర్తి రామ్మోహన్, నాయకులు డెరంగుల బ్రహ్మం, యర్రా అప్పారావు, ముత్యాల అప్పారావు, బంక మల్లయ్య, మాటేటి కిరణ్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.




# డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం చేస్తున్న యువ రైతుని సన్మానించిన వినోద్ రావు



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి : కొనిజర్ల మండలం ఉప్పలచలక గ్రామానికి చెందిన సోమ దరియా సింగ్ సీవీఆర్ కాలేజీ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసుకుని మూడు నెలలు లో ఎల్ అండ్ టీ లో జాబ్ చేస్తూ ఆధునిక వ్యవసాయం చేయాలని పట్టుదలతో తన భూమిలో డ్రాగన్ ఫ్రూట్ వ్యవసాయం చేస్తున్నాడు అది తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్ రావు సోమ దరియా సింగ్ నీ శాలువాతో సన్మానించినారు. ఈ సందర్భంగా వినోద్ రావు మాట్లాడుతూ వ్యవసాయాన్ని చిన్న చూపు చూడకూడదని వ్యవసా యం లోనే సాయం ఉన్నదని దేశానికి వెన్నెముక రైతేనని కాబట్టి యువత వ్యవసాయ రంగంలో ముందుకు రావాలని, కొత్త పద్ధతిలో వ్యవ సాయం చేస్తూ లాభాలు ఘడిస్తూ అనేక మంది రైతులకు ఆదర్శంగా నిలవాలని వారు కోరారు. వ్యవసాయ రంగం లేనిదే దేశానికి మనుగడ కష్టమని మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ రైతుల కొరకు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, యువ రైతులు వాటి గురుంచి అధ్యయనం చేసి సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, వైర అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, ప్రశాంత్ కుమార్, వెంకటేశ్వర్లు, వీరభద్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామాత్యులు శ్రీ ఉత్తంకుమార్ రెడ్డి నిర్వహించిన, వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ లో పాల్గొన్న టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి డా మద్ది శ్రీనివాస్ రెడ్డి



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామాత్యులు ఉత్తంకుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణ, సంబంధిత అంశాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సీజన్లో అత్యధిక ధాన్యం ఉత్పత్తి జరిగిందని, మద్దతు ధరతో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాలు తగినన్ని సకాలంలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు బట్టి విక్రమార్క , వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు , రోడ్లు భవనాల , సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , రవాణా, బీసీ సంక్షేమ శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖామాత్యులు దుదిల్ల శ్రీధర్ బాబు , ఐఏఎస్ చౌహాన్ , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం.



## న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై. ప్రకాష్.

కారేపల్లి, నవంబర్ 5, ప్రజా జ్యోతి: సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా అమరవీరుల వారోత్సవాలలో భాగంగా సింగరేణి మండలం మాదారం, మంగళ తండ, గోవింద తండా గ్రామాలలో అమరవీరులు కామ్రేడ్ తుమ్మలపల్లి హనుమంతరావు, షేక్ బిక్కుమియా, ధారావత్ కసన, కాలియా స్థూపాలపై మంగళవారం జెండాలు ఎగరవేసి నివాళులర్పించడం జరిగిందనిసింగరేణి మండల కార్యదర్శి వై. ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం అసమానతలు లేని సమ సమాజ స్థాపన ధ్యేయంగా 1969 నుండి నేటి వరకు రాజ్య హింస, బూటకపు ఎన్ కౌంటర్లు, భూస్వాముల గుండాల చేతిలో 15,000 మంది విప్లవకారులు, వీరులు, వీరవనితలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించినారని , దేశాన్ని, దేశ సంపదను, భూములను, పరిశ్రమలను, ఖనిజ సంపదను ఆధాని, అంబానీలకు తాకట్టు పెట్టినారని ఈ చర్యలను అన్ని వర్గాల ప్రజలు ఐక్యమై ముక్తకంఠంతో ఖండించి ప్రతిఘటన పోరాటాలలో భాగస్వాములై ముందుండి పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గద్దం వెంకన్న, ఎర్రయ్య ,సతీష్, ప్రసాదు, వీరు, నరసింహారావు, భద్రమ్మ, నరేష్ ,అంజి, తావూరియా తదితరులు పాల్గొన్నారు.

## టి.ఎస్.యు.టి.ఎఫ్. కూసుమంచి మండల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులుగా చిలకల.శ్రీనివాసరావు, మండవ.నర్సయ్య




పాలేరు నవంబర్ 5 ప్రజా జ్యోతి : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కూసుమంచి మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా చిలకల శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా మండవ.నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు మండల మహాసభలో విద్యా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో టీఎస్ యుటిఎఫ్ ముందు ఉంటుందని అటువంటి సంఘంలో సభ్యులుగా ఉండి సంఘ బలోపేతానికి కృషి చేయాలని టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జివి నాగమల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరాజు నాగలక్ష్మి కోశాధికారిగా బాబురావు ఆడిటర్గా శ్రీనివాసరావు మహిళా కార్యదర్శిగా పద్మ లను ఎన్నుకున్నారు ఈ కమిటీ రాబోయే సంవత్సరకాలం లో విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు .ఈ సమావేశంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలి.

## రాష్ట్ర మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించిన ఏఎన్ఎంలు.



కారేపల్లి, నవంబర్ 04, ప్రజా జ్యోతి: తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు గత 17 సంవత్సరాలుగా రెండో ఏఎన్ఎం గా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని సింగరేణి మండల పరిధి లో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన శంషాబాద్ లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం లో యూనియన్ ( ఏఐటీయూసీ) ప్రథమ మహాసభల గోడపత్రికను మంగళవారం విడుదల చేశారు. గోడపత్రికలను సింగరేణి పిహెచ్సికి అతికించిన అనంతరం వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం ఏ ప్రభుత్వము మమ్మలని కనికరించలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికిని తమ జీవితాల్లో మాత్రం ఎటు వంటి మార్పు రాలేదన్నారు. 33 రికార్డులతో పాటు అన్ని ఆన్లైన్ పనులు చేయాల్సి వస్తుందని, చాలామంది రిటైర్మెంట్ అయ్యారని మరి కొంతమంది రిటైర్మెంట్ కి దగ్గరలో ఉన్నారన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో వచ్చినవారు చివరికి ఆ కాంట్రాక్ట్ ఉద్యోగి గానే పదవి విమరణనో లేక మరణం తోనే ముగుస్తుందనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం గురించి పని చేసే తమకు ఎటువంటి హెల్త్ కార్డు లేదన్నారు. వాస్తవానికి రెగ్యులర్ ఉద్యోగులతో పోల్చినప్పుడు తమ జీతం చాలా తక్కువగా ఉంటుందని కాంట్రాక్టు పద్ధతిలో నెలకురూ 52000 రావాల్సిన తమకురూ 27,000 వస్తుందన్నారు. ఆ వచ్చేరూ 27000 లలో రికార్డులకు , ఉద్యోగంలోని ఇతర ఖర్చులకు పదివేలకు పైగా హెచ్చించాల్సి వస్తుందన్నారు. మా జీతాన్ని చూపించి మాలో కొంతమందికి రేషన్ కార్డు తొలగించారని తద్వారా ఆరోగ్యశ్రీ సేవలు కూడా మాకు ఉపయోగపడటం లేదన్నారు. హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేసే మాకు ఏ ప్రభుత్వం కూడా కనీసం హెల్త్ కార్డు కూడా ఇవ్వలేని దారుణమైన స్థితిలో మేమున్నామని వారు వాపోయారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో గత సంవత్సరంలో నిరవధికా సమ్మె నిర్వహించినప్పుడు మా సమస్యల పరిష్కరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ ఆ హామీలను ఈనాటి వరకు నెరవేర్చ లేదన్నారు. ఈనెల 17వ తేదీన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎలైట్ హోటల్ నందు జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలో భవిష్యత్తు పోరాటాల గురించి చర్చించి కార్యక్రమాల రూపకల్పన చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, కల్పనా,నరసమ్మ ,లీలబాయ్, కోటమ్మ, విజయకుమారి, విజయకుమారి, నాగమణి, అనిత, విజయలక్ష్మి, చంద్రకళ,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు..

# రైతులను నిలువు దోపిడి చేస్తున్న సిసిఐ.

## దళారీలకు మేలు చేస్తున్న సిసిఐ సిబ్బంది.

## న్యూ డెమోక్రసీ నాయకులు ఆవు నూరి మధు,ప్రకాష్.



కారేపల్లి, నవంబర్ 5,ప్రజా జ్యోతి: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీసుకొచ్చే పత్తిని ఎలాంటి షరతులు లేకుండా తేమశాతం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరు మధు అన్నారు. సింగరేణి మండలం ఆప్పాయి గూడెం పంచాయితీ పరిధిలోగల శ్రీలక్ష్మి కోటక్ జిన్నింగ్ మిల్లు ముందు మంగళవారం న్యూ డెమోక్రసీ నేతలు ధర్నా నిర్వహించారు. ఇల్లందు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఇరువురి ఎమ్మెల్యేలు సంయుక్తంగా సోమవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన విషయం విధితమే అయితే పలువురు రైతులకు సంబంధించి తేమ శాతం అధికంగా ఉందని పత్తి కొనుగోలుకు నిరాకరించారు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న న్యూ డెమోక్రసీ నాయకులు పత్తి రైతులకు న్యాయం జరగాలని కోరుతూ మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ నేతలు అవునూరి మధు, వై. ప్రకాష్ లు మాట్లాడుతూ వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు, మంచు కురవడంతో పత్తిలో తేమశాతం అధికంగా ఉన్నదని సీసీఐ అధికారులు బయ్యర్లు నిరాకరించడం విచారకరమన్నారు. ఈనెల పదవ తేదీ వరకు పత్తి కొనుగోలు చేయడం లేదని సంబంధిత సీసీఐ అధికారులు తెలపడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ ను ఫోన్లో సంప్రదించగా ప్రభుత్వంఎలాంటి సర్కులర్ జారీ చేయలేదని తెలిపినట్లు పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమాల ద్వారా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రకటించిన పత్తి మద్దతు ధర 7521 రూపాయలకు పత్తి కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల యాజమాన్యాలు, దళారులతో కుమ్మక్కయి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. తక్షణమే రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని లేదంటే కొనుగోలు కేంద్రాల ముందు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు చింత రజిత, ఎనగంటి చిరంజీవి, మస్తాన్, నరసింహారావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో ఘనంగా నాగలచవితి.



కారేపల్లి, నవంబర్ 05, ప్రజా జ్యోతి: సింగరేణి మండలంలో పలు గ్రామాలలో మంగళవారం నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున స్నానం ఆచరించి పుట్టల వద్దకు తరలి వెళ్లారు. ఆయా పుట్టల వద్ద పూజలు నిర్వహించి పుట్టలకొలనులలో పాలు పోసి తమ ఇష్టదైవాన్ని ప్రార్థించుకున్నారు. పాలతో పాటు నువ్వులు, బెల్లంతో చేసిన చలివిడి, కోడిగుడ్లు, పిండి పదార్థాలు పుట్టలో వేసి నమస్కరించి కున్నారు. మహిళలు పుట్టమన్ను తాకి ఆయురారోగ్యాలతో సౌభాగ్యంగా జీవించేలా దీవించాలని నాగ దేవతను కోరుకున్నారు. అనంతరం పుట్టల వద్ద చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు దీపావళి బాణసంచా కాల్చి గ్రామాల్లో నాగుల చవితి పూజలు ఘనంగా నిర్వహించారు.

# రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్**

**2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**దొడ్డు, సన్న రకం ధాన్యం గుర్తింపుపై అధికారులకు శిక్షణ**

**సన్న రకం ధాన్యం బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే దక్కేలా చూడాలి**

**ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి – జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు.ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ,సన్న రకం ధాన్యం క్రింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లకు తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణ అందించాలని అన్నారు. జిల్లాలో ఉన్న మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ అఫిడవిట్ తీసుకొని ధాన్యం అలాట్మెంట్ చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద ఎక్కడ తాలు పేరుతో కోతలు పెట్టవద్దని అన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలని అన్నారు. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతం ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ధాన్యం మన జిల్లాకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం పట్ల సానుకూలత వచ్చే విధంగా అధికారులు పని చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, సన్న రకం ధాన్యానికి బోనస్ వెంట వెంటనే అందేలా చూడాలన్నారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల పరిధిలో వీలైనంతవరకు రైతుకు అనుకూలంగా ఉంటూ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యత ప్రమాణాలను రైతులకు వివరించాలని, రైతుల కోసమే మనం ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా




జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల (1.3 లక్షల సన్న రకం, 70 వేల దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందులో డీసీఎంఎస్ ద్వారా 27, డిఆర్డీవో ద్వారా 138, పిఏసీఎస్ ద్వారా 158 కేంద్రాల ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు మొదలగు మౌళిక వసతులు కల్పించామని అన్నారు. మన జిల్లా సరిహద్దు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నందున 14 చెక్ పోస్ట్ లను అప్రమత్తం చేశామని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు 24 గంటలపాటు షిఫ్టులలో చెక్ పోస్ట్ వద్ద ఉండేలా చర్యలుతీసుకున్నామని అన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని చెక్ పోస్ట్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత, లోకల్ రైతు, ధాన్యం దిగుబడి వివరాలను సర్టిపై చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్ తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాలో ప్రైవేటు గోదాములలో అందుబాటులో ఉన్న స్థలం గుర్తించామని అన్నారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అప్పగించిన వెంటనే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేస్తామని సమాచారం అందించామని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు జిల్లాలో మిల్లర్లు అంగీకరించారని తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి. పుల్లయ్య





పాలేరు నవంబర్ 05 ప్రజా జ్యోతి కూసుమంచి మండలంలోని సంధ్య తండ, లాల్సింగ్ తండ గైగొల్లపల్లి గ్రామాలలో వేరుశనగ, ప్రత్తి ,మిర్చి వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య గారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో లద్దెపురుగును గమనించడం జరిగిందని నివారణకు నోవల్యూరాన్ 200 మి.లీ లేదా ఫ్లుబెండమైడ్ 40 మీ లి 200 మీటర్ల నీటిలో కలిపి ఎకరానికి సరిపడా పిచికారి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా విషపు యెర్రలను వాడటం వల్ల కూడా ఈ లద్దె పురుగును నివారించవచ్చని సూచించారు. విషపు ఎర తయారీకి ఐదు కేజీల తవుడు, అరకేజీ బెల్లం మరియు 500 గ్రాములు మోనోక్రోటోఫాస్ మందును కలిపి చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళలో చల్లడం వల్ల లద్దె పురుగు తీవ్రత అధికంగా ఉన్నప్పుడు నివారించవచ్చని సూచించారు. అనంతరం ప్రత్తి, మిర్చి మరియు వరి పంటలను సందర్శించారు. చీడపీడలను గమనించిన వెంటనే రైతులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి మానస రైతులు పాల్గొన్నారు.

# సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది ఆర్థిక సాయం.



సత్తుపల్లి రూరల్, నవంబర్ 5:(ప్రజా జ్యోతి) జలగం వెంగళరావు సింగరేణి ఉపరితల గనుల్లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తమతోపాటు ప్రైవేట్ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పాలకుర్తి సుందర్ రావు రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని సుమారు 38 వేల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సీనియర్ ఇన్స్పెక్టర్ అజముద్దీన్ ఖాన్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ శాఖలో ఎవరికి ఇబ్బంది కలిగిన ఆర్థికంగా తోడుంటామని సత్తుపల్లి గనిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది సాయం చేసే విషయంలో తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జమెదర్ దేవదానం, విజేందర్, మల్లేష్, సీనియర్ సెక్యూరిటీ సిబ్బంది కనకయ్య, జోసెఫ్, నారాయణ, ఆయాజ్, మోహన్ రావు, సుభాని, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

# మిస్ట్ కళాశాలలో 30 మంది కి ఉద్యోగ అవకాశాలు.




సత్తుపల్లి నవంబర్ 5 ప్రజా జ్యోతి.: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన,క్యు స్పైడర్ ఆధ్వర్యంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులకు ఆ కంపెనీ ద్వారా,ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగిన ఇంటర్వ్యూలలో బెంగళూరు నుండి వచ్చిన కంపెనీ ప్రతినిధులు రిటర్న్ టెస్ట్,గ్రూప్ డిస్కస్ ద్వారా ప్రతిభ కనపరిచిన విద్యార్థిని,విద్యార్థులకు 30 మంది ప్రతిభ కనపరిచి ఉద్యోగం సంపాదించారు. ఒక్కొక్కరికి 5.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ బోధనతోపాటు ,ఉద్యోగ కల్పన,అంశాలపై ప్రత్యేక చొరవ తీసుకొని, శిక్షణల ద్వారా విజయం సాధించటం అదృష్టం అన్నారు. ఉద్యోగం సంపాదించిన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్,ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి.రామచంద్రరావు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ రాఘవ రాజు,వివిధ విభాగాల అధిపతులు,అధ్యాపకులు వారిని అభినందించారు.

# సైబర్ నేరగాళ్ళతో జాగ్రత్త.



కారేపల్లి సిఐ, ఎస్ఐ.

కారేపల్లి, నవంబర్ 5, ప్రజా జ్యోతి: సైబర్ నేరగాళ్లు వివిధ లోను యాపులతో అమాయకులకు మోసాల వల వేస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని కారేపల్లి సిఐ,బి. తిరుపతిరెడ్డి, ఎస్ఐ, ఎన్. రాజారామ్ లు సూచించారు. కారేపల్లి పోలీస్ స్టేషన్లో మంగళవారం వారు మాట్లాడుతూ బాధితులు ఈ యాప్ల ను ఇన్స్టాల్ చేసుకోవడంతో, వారి ఫోన్లపై నేరస్తులు నియంత్రణ పొందుతారన్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా చిన్న మొత్తంలో రుణాలు ఇస్తారు, కానీ తర్వాత బాధితుల ఫోటోలను నగ్న చిత్రాలుగా మార్ఫింగ్ చేసి, బ్లాక్ మెయిల్ చేస్తారని అన్నారు. కేవలం రెండు వేల నుండి అయిదు వేల రూపాయల వరకు అప్పుగా ఇచ్చి, ఆ తర్వాత లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తారని తెలిపారు. డబ్బులు ఇవ్వకుంటే బాధితుల మార్ఫిడి ఫోటోలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తామని, లేదా వాళ్ల పరిచయస్తులకి పంపుతామని బెదిరింపులకు పాల్పడతారన్నారు. వారి బ్లాక్మెయిల్ కు లొంగిపోయి, బాధితులు వేలు, లక్షల్లో డబ్బులు పోగొట్టుకోవడమో లేదా అవమానంగా భావించి ఆత్మహత్యలకు పాల్పడడమో చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోన్ యాప్ నేరగాళ్ల బారిన పడవద్దని, ఒకవేళ మీరు బాధితులు అయితే వెంటనే డయల్ 100 లేదా 1930 కు కాల్ చేయాలని వారు పేర్కొన్నారు.

# గౌడ వన సమారాధన ను విజయవంతం చేయండి...



పెనుబల్లి, నవంబర్ 05, (ప్రజాజ్యోతి): పెనుబల్లి మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10 న ఆదివారం నాడు గౌడ వనసమారాధన నిర్వహించడం జరుగుతుందని, దీంతో పాటు పెనుబల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న గౌడ బంధువులు అందరూ తప్పక హాజరుకావాలని పెనుబల్లి గౌడ సంఘం నాయకులు కోరారు.

# వైద్య విభాగం ద్వారా రోగులకు సమర్థవంతమైన సేవలు అందాలి

**అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ**

**పి.హెచ్.సి లో అందుబాటులో ఉన్న డ్రగ్స్ (మందుల)**

**వివరాలతో బోర్డు ఏర్పాటు**

**బయోమెట్రిక్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు**

**గర్భిణీ మహిళల ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పై దృష్టి సారించాలి**

**వైద్య ఆరోగ్య శాఖపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైద్య విభాగం ద్వారా రోగులకు సమర్థవంతమైన సేవలు అందాలని, ఆ దిశగా జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్య శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 26 పి.హెచ్.సి. లు, 4 అర్బన్ పి.హెచ్.సి. లలో అందుబాటులో ఉన్న మందుల వివరాలతో బోర్డులను రేపటి వరకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో వైద్య శాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ జిల్లా యంత్రాంగం చేపట్టిందని, ఎక్కడ చిన్న పొరపాటు, తప్పు జరిగినా కఠినంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ సంబంధించి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్స్, అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించి, నవంబర్ చివరి నాటికి నివేదిక సమర్పించాలని అన్నారు. పి.సి.పి.ఎన్.డి.టి క్రింద స్కానింగ్ సెంటర్ల తనిఖీలు వారం రోజులలో పూర్తి చేయాలని అన్నారు.ప్రతి పి.హెచ్.సి. లో బయో మెట్రిక్ అటెండెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు చేయాలని, పి.హెచ్.సి. వారీగా సిబ్బంది హాజరు వివరాలను సమర్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఫీల్డ్ స్థాయిలో వెళ్ళే సిబ్బంది లైవ్ లోకేషన్ తీసుకోవాలని అన్నారు. టీబీ కేసుల గుర్తింపు, అవసరమైన చికిత్స అందించడం, మొదలగు కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని అన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ చేయించి వారికి టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని అన్నారు. ఫస్ట్ టైం ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ తక్కువగా ఉన్న పి.హెచ్.సి. కేంద్రాల పరిధి పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనీమియా కేసులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల ప్లానింగ్ పక్కగా జరిగేలా చూడాలని అన్నారు. గర్భిణీ మహిళలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందాలని, అనీమియా ఉన్న మహిళల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మొదటి కాన్పు జరిగే మహిళలను సాధారణ ప్రసవాల దిశగా ప్రోత్సహించాలని, వారిచే సబ్ సెంటర్ల పరిధిలో అవసరమైన వ్యాయామం, యోగా చేయించాలని అన్నారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలో డిసెంబర్ నుంచి మార్చి వరకు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. పిల్లలకు సంబంధించి కనీస వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించాలని అన్నారు.పాఠశాలల్లో పిల్లలకు కనీస వైద్య పరీక్ష నిర్వహించాలని, సమస్యాత్మకంగా ఉన్న పిల్లలకు వైద్యుల ఆధ్వర్యంలో జనరల్ ఆస్పత్రిలో అవసరమైన పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, జిల్లా టిబి అధికారి డా. వి. సుబ్బారావు, డిప్యూటీ డి.ఎం.అండ్ హెచ్.ఓ. డా. సైదులు, వైద్య ఆరోగ్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఖమ్మం రూరల్ కామంచికల్ మండలానికి చెందిన బాల నాగన్న తండ్రి రాములు వయసు 40 సంవత్సరాలు వృత్తి వ్యవసాయం . 9-10- 2024 న నా భార్య అయిన బాల నాగమణి తో చిన్న కారణం తో గొడవ జరగడం జరిగిందని అందుకు ఆమే పాయిజన్ తీసుకోవడం జరిగిందని కంగారుగా ఆవెను తీసుకుని అదే రోజు రాత్రి 10 గంటలకు ఆర్ఎంపీ సహాయంతో ఖమ్మం లో శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ కు తీసుకుని వెళ్లడం జరిగిందని . మేము ముందుగానే హాస్పిటల్ యాజమాన్యం కి నిరుపేద కుటుంబానికి చెందిన వారము మా దగ్గర డబ్బులు లేవు మీ దగ్గర సీఎం ఆర్ ఎఫ్ ఉందా అని అడిగామని అన్నారు . దానికి హాస్పిటల్ యాజమాన్యం మా యొక్క హాస్పిటల్ కు అన్ని అర్హతలు కలిగి ఉన్నాయని మీకు ఎలాంటి ఇబ్బంది కలగదని అడ్మిట్ కండి అని చెప్పారని హాస్పిటల్ బాధ్యులు పేర్కొన్నారు . 9-10-2024 తారీకు నుండి 12- 10- 2024 తారీఖ్ సుమారు ఒంటి గంట వరకు నాలుగు రోజులపాటు వైద్యం చేస్తూ మా దగ్గర నుండి 2,50,000 వసూలు చేశారని తెలిపారు . 12 -10 - 2024 మధ్యాహ్నం లివర్ మొత్తం కరాబ్ అయింది . వైద్యం వికటించి పేషెంట్ అపస్మారిక స్థితిలోకి వెళ్ళింది . వెంటనే హాస్పిటల్ యాజమాన్యం నా యొక్క భార్యను హాస్పటల్ నుండి త్వరగా బయటకి తీసుకెళ్లమని దబాయించరు . నాకు ఏమీ తోచక నా యొక్క బంధువులను పిల్చుకున్నాను . మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కన్సల్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ ను కలిసి వివరణ అడగగా సరేనా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించినాడని బాధితులు వాపోయారు . వెంటనే హాస్పిటల్ యజమాని అయిన పసుమర్తి లక్ష్మారావు తో మాట్లాడితే మేము చేసేది ఏమీ లేదు పేషెంట్ ను తీసుకుని వెళ్లండి అని అన్నప్పుడు సరే మేము వెళ్ళిపోతాం కానీ పేషెంట్ డిశ్చార్జి సమ్మరీ ఇవ్వని అడిగినప్పుడు దానికి మాకు ఇచ్చే అర్హత లేదు మీకు డిశ్చార్జ్ సమ్మరీ ఇవ్వలేం మా యొక్క ఆస్పటల్ బ్లాక్ లిస్టో ఉన్నది మీకు సిఎంఆర్ఎఫ్ బిల్లులు ఇవ్వలేమని అప్పుడు చెప్పారని బాధితులు తెలిపారు . అదేం సార్ మీము ముందు అడిగినప్పుడు అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు కదా ! ఇప్పుడేమో లేవని అంటున్నారని అడుగుతే మమ్మల్ని దబాయించి అక్కడున్న స్టాప్ తో మ్యాన్ హ్యాండ్లింగ్ చేస్తూ బయటికి గెంటేశారని అన్నారు . పైగా మా మీద అక్రమ కేసులు పెడుతూ మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు . సీఎంఆర్ఎఫ్ ఉందని ప్రజలను మోసం చేస్తూ బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న హాస్పిటల్ యజమాని పై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని పత్రిక ముఖంగా కోరారు . అలాగే మాకైనా వైద్య ఖర్చులు ఇప్పించి మాకు న్యాయం చేయాలని కోరారు.

# బాలకృష్ణను అభినందించిన డాక్టర్ మట్టా దయానంద్..






తల్లాడ, నవంబర్ 5 (ప్రజా జ్యోతి న్యూస్): బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ను అభినందించారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలో ఓ కార్యక్రమంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సేవాసమితి ద్వారా ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. దీంతో దయానంద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, వృద్ధులతోపాటు విద్యార్థులకు కూడా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. తల్లాడ మండల వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను చూస్తున్నానని, ఈ సందర్భంగా ఆయన బాలకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పగడాల లచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, దేవరపల్లి శ్రీను, ధర్మసోత్ దశరద్ నాయక్, సేవా సమితి సభ్యులు బోనాశి శ్రీనివాసరావు ఉన్నారు.

# ఘనంగా పల్లె రామకృష్ణ జన్మదిన వేడుకలు.

సత్తుపల్లి నవంబర్ 5 ప్రజా జ్యోతి. : పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ పల్లె రామకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు,గాదె చెన్నారావు, మట్టా చెన్నారావు,మానుకోట ప్రసాద్,రఫీ,జక్కుల ప్రభాకర్ వంగరిరాకేష్,సందీప్ గౌడ్, గణేష్, మణి,దిలీప్,భరత్ కుమార్, గొర్లమారి రామ్మోహన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఉద్యమకారులకు బాలకృష్ణ చేయూత..




## ఘన సన్మానంతో పాటు దుస్తులు,ఆర్థిక సాయం..

తల్లాడ, నవంబర్ 5 (ప్రజా జ్యోతి న్యూస్): తొలితరం తెలంగాణ ఉద్యమకారులను బహుజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మోదుగు బాలకృష్ణ సన్మానించారు. మంగళవారం ఉద్యమకారులు మోదుగు ఆశీర్వాదం, రావుల గోపి గౌడ్ లను సన్మానించి వారికి బట్టలు, ఆర్థిక సాయం అందించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ప్రారంభ దశలో ఆశీర్వాదం ఒక్కడే జెండాలు పట్టుకొని తిరిగి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే అనేకమంది సకలజనుల సమ్మె లాంటి నిరసనలు చేపట్టారని తెలిపారు. ఇటువంటి వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారికి ప్రతినెల తమ వంతు సహకారంగా ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు (జివిఆర్) మాట్లాడుతూ నిరుపేదలను, పేద విద్యార్థులను ఆదుకోవటంతో పాటు ఉద్యమకారులను సైతం గుర్తించి ఇలా చేయడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వారు బాలకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు బోనాసి శ్రీనివాసరావు, కాటయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలోనే ఆదర్శ ఆర్టీసీ డిపో సత్తుపల్లి... ఆర్.ఎం.సరి రాం.



సత్తుపల్లి నవంబర్5 ప్రజా జ్యోతి.: తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఉందని రీజినల్ మేనేజర్ సరి రాం అన్నారు. మంగళవారం సత్తుపల్లి డిపోలో జరిగిన ఉత్తమ డిపో సన్మాన కార్యక్రమము లో ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత, క్రమశిక్షణతోనే,ఉత్తమ డిపో సాధించడం సాధ్యమైనది అని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నిబద్ధత ప్రకారం పని చేసుకుంటూ వెళితే,ఎలాంటి విజయాలైన సాధించవచ్చునని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి ఉత్తమ డిపో అవార్డు సత్తుపల్లి డిపోకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా ఉత్తమ డిపో అవార్డు అందుకోవడం సామాన్యమైన విషయం కాదని,దీనికి ఎంతో కృషి,పట్టుదల అవసరమని అందుకు సత్తుపల్లి డిపో ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధతో ఉత్తమ డిపో అవార్డు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డిపోకు వచ్చిన 3 లక్షల క్యాష్ అవార్డుతో ఉద్యోగులందరికీ బహుమతులనుకొని అందజేశారు. రెండు పర్యాయాలు ఉత్తమ డిపో అవార్డు సాధించడానికి కృషి చేసిన డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మిని సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. డిప్యూటీ ఆర్.ఎం.ఓ పవిత్ర మాట్లాడుతూ ఉద్యోగుల కృషి ఆనిర్వచనీయమని, వారి ఉత్తమ సేవల వలనే ఉత్తమ డిపో అవార్డు సాధ్యమైనదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం.మెకానిక్ భవాని ప్రసాద్, మధిర, ఖమ్మం,కొత్తగూడెం మణుగూరు డిపో మేనేజర్లు, మరియు అసిస్టెంట్ మేనేజర్లు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రషీద్ మృతి కాంగ్రెస్ కు తీరని లోటు....మట్టా.




సత్తుపల్లి నవంబర్5 ప్రజా జ్యోతి.: పట్టణంలో సూపరచితుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ రషీద్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ జెండా కప్పి,ఘన నివాళులు అర్పించారు. రషీద్ మృతి పార్టీకి తీరని లోటు మంచి నాయకుడిని కోల్పోయానని సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనందబాబు,గాదె చెన్నారావు,కమల్ పాషా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

సత్తుపల్లి నవంబర్5 ప్రజా జ్యోతి.: నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ శరత్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సత్తుపల్లి 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో టౌన్ 3 ఫీడర్,బ్రేకర్, మెయింటినెన్స్ నిమిత్తం కళాభారతి,అంబేద్కర్ నగర్ కల్పతరు,మహాత్మా గాంధీ,రామాలయం, అవని వెంచర్,ఎన్ టి ఆర్ కాలనీ, జలగం నగర్,వాణి విద్యాలయ,కృషి బైపాస్, విద్యానగర్ రోడ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వి వినియోగదారులు సహకరించాలని కోరినారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ చైర్మన్ పాలెపు రామారావు



కల్లూరు నవంబర్ 05(ప్రజా జ్యోతి): చెన్నూరు సొసైటీ పరిధిలోని లింగాల గ్రామం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ పాలెపు రామారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర,బోనస్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని,తాలు,తేమ,మట్టి పెల్లలు లేకుండా ఉండాలని,ధాన్యాన్ని మిషన్ ప్రకారం ఏఈఓ లు చూసి నిర్ణయిస్తారని అన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్తుపల్లి ఏఎంసీ కి పంపిస్తారని ఏవో రూప అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీఓ సురేష్,ఏవో రూప,సీఈవో మురళి, సొసైటీ డైరెక్టర్ దేవరపల్లి భాస్కర్ రావు,దేవరపల్లి వెంకట్రావు,మద్దినేని లోకేశ్వరరావు, మొట్టూరి పుల్లయ్య ఏపూరి సాంబ, సంగెపు శివ,భాస్కరరావు రైతులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



కల్లూరు నవంబర్ 05(ప్రజా జ్యోతి): కల్లూరు పరిధిలోని గోపాల దేవబోయినపల్లిలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ఆరబోసిన ధాన్యం నాణ్యతను పరిశీలించి,అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అధికారులకు పలు సలహాలు,సూచనలు చేస్తూ రికార్డులను పరిశీలించారు.ఆయన వెంట స్టేట్ అబ్జర్వర్ సురేంద్రమోహన్,ఆర్డీవో రాజేందర్, స్పెషలాఫీసర్ శ్రీలత,తహశీల్దార్ సాంబశివుడు,ఏపీఎం వెంకట రామారావు ఉన్నారు.

# పాస్టర్లకు ప్రభుత్వాలు వేతనాలు అందించి ఆదుకోవాలి






## క్రైస్తవులపై దాడులను అరికట్టాలి.. సుదర్శనం

కల్లూరు,నవంబర్ 05 (ప్రజా జ్యోతి): దేశంలో,రాష్ట్రంలో నిత్యం క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని టీసిసి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి సుదర్శనం సూచించారు.మంగళవారం కల్లూరు మండలంలోని బత్తులపల్లి గ్రామంలో టిసిసి సంఘం పాస్టర్ల సమావేశాన్ని పాస్టర్ కొర్నేలి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ పాస్టర్లకు ప్రభుత్వాలు తమ సహాయ సహకారాలను అందించాలని కోరారు.ఇల్లు,ఇళ్ల స్థలాలు,స్మశాన వాటికలు,కళ్యాణ మండపాలు ,చర్చిలకు నిధులు తదితర వాటిని కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్య సలహాదారులు దేవా మందిరం, రాష్ట్ర కన్వీనర్ నిరీక్షణ రావు, మహిళా అధ్యక్షురాలు కరుణమ్మ, పెనుబల్లి మండలం అధ్యక్షులు పేతురు,కల్లూరు మండల అధ్యక్షులు వేణుబాబు, పెనుబల్లి సెక్రెటరీ డేవిడ్ పాల్, కల్లూరు మండలం ప్రేయర్ సెల్ అధ్యక్షులు జాషువా రెడ్డి,రత్నాకర్, తదితర గ్రామాల పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్లు అరెస్ట్

కల్లూరు నవంబర్ 05(ప్రజా జ్యోతి): మండల పరిధి చిన్న కోరుకొండి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మంగళవారం రాత్రి గుడిద నాగరాజు కూరగాయల షాపులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో పేకాట స్థావరంపై దాడి చేసి చెన్నా వీరబాబు,కరుకుల వెంకటేశ్వరరావు,యాసా వెంకటకృష్ణ,చింతమాల శంకర్, రెడ్డి నరసింహారావు,జిల్లెల్ల వినయ్ కుమార్ లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.షాపు యజమాని గుడిద నాగరాజు పారిపోయాడు.వారి వద్ద నుండి 4450 రూపాయలను స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

## బీఎస్ఎన్ఎల్ స్పెషల్ రీఛార్జ్ ఆఫర్.. అన్‌లిమిటెడ్ కాల్స్.. 600 జీబీ డేటా..!

హైదరాబాద్ : పండుగల సీజన్ సందర్భంగా ప్రైవేటు టెలికం సంస్థలు సబ్ స్క్రైబర్స్‌కి దీపావళి సందర్భంగా ఆఫర్స్‌ని ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ టెలికం రంగ సంస్థ భారతీయ సంచారం నిగమ్ లిమిటెడ్ (ఖాఔఒ) దీపావళి సందర్భంగా యూజర్లకు సరికొత్త ఆఫర్‌ని తీసుకువచ్చింది. ఈ ఆఫర్ పండుగ తర్వాత కూడా చెల్లుబాటు కానున్నది. జియో దీపావళి ఆఫర్‌తో పోలిస్తే మెరుగైన ప్రయోజనాలను అందిస్తున్నది. బీఎస్ఎన్ఎల్ దివాళీ ఆఫర్ అక్టోబర్ 28 నుంచి నవంబర్ 7 వరకు చెల్లుబాటు అవుతుంది. యూజర్లు రూ.1,9000 రీచార్జ్ ప్లాన్‌పై రూ.100 డిస్కౌంట్‌ని ప్రకటించింది. అంటే ప్లాన్ రూ.1,899 మాత్రమే అందుబాటులో ఉంటుంది.ఈ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ వాయిస్ కాలింగ్‌తో పాటు 600 జీబీ డేటాను పొందుతారు. 365 రోజుల పాటు రోజుకు వంద ఉచిత ఎస్ఎంఎస్ సైతం పొందుతున్నారు. ఈ ఆఫర్‌ని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. దీపావళి స్పెషల్ ఆఫర్‌లో రూ.1,999 రీచార్జ్ వోచర్‌పై రూ.100 తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొంది ఏడాది పాటు 600 జీబీ డేటా, అపరిమిత కాల్స్, గేమ్స్, మ్యూజిక్ సైతం ఆస్వాదించొచ్చని పేర్కొంది. ఈ ఆఫర్ నవంబర్ 7 వరకు చెల్లుబాటవుతుందని పేర్కొంది.ఇదిలా ఉండగా.. వైశాట్ సహకారంతో బీఎస్ఎన్ఎల్ తొలిసారిగా డైరెక్ట్ టూ డైరెక్ట్ సర్వీస్‌ని విజయవంతంగా ట్రయల్ నిర్వహించింది. త్వరలో వినియోగదారులకు సిమ్‌కార్డ్ అవసరం లేకుండా నేరుగా డివైజ్ టూ డివైజ్ మధ్య ఆడియ, వీడియో కాల్స్ చేసుకునేందుకు వీలు కల్పించబోతున్నది. ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ట్రయల్స్ సమయంలో బీఎస్ఎన్ఎల్ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ని ఉపయోగించి 36వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉపగ్రహ నెట్‌వర్క్ ద్వారా విజయవంతంగా ఫోన్ కాల్ చేసింది. అత్యవసర సేవలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఈ సర్వీసులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని..

# సర్టిఫికెట్లలో పేరు మార్పునకు సర్కారు అంగీకారం.

**జగిత్యాల :** చిన్న వయసులో పెట్టిన పేర్లు ఆధునికంగా లేవని భావించి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పేరు మార్చుకున్న వారికి హైకోర్టులో ఊరట లభించిందని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,న్యాయవాది హరి ఆశోక్ కుమార్ తెలిపారు.మార్చుకున్న పేర్ల తో కొత్తగా ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు.పేర్లు మార్చుకున్నప్పటికీ ఎస్.ఎస్.సీ,ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లలో పాత పేర్లు మార్చి కొత్త పేర్లు మార్చి కొత్తగా సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని నిషేధిస్తూ జారీ అయిన జీ ఓ.నెంబర్.1263 ని సవాలు చేస్తూ వి.మధుసూదన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేస్తూ ఆ జీవో లోని సెక్షన్ (సి)రూల్1,2,3 లను కొట్టేయాలని కోరారు.దీనిపై చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాధే,జస్టీస్ జే.శ్రీనివాస్ రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది.చట్టబద్ధంగా పేరు మార్చుకున్న తర్వాత కొత్త సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఇబ్బంది ఏమిటని రాష్ట్ర ప్రభుత్వంను హైకోర్టు ప్రశ్నించింది.ఈ సందర్భంగా 'జిగ్యా యాదవ్ వర్సెస్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉదాహరించింది.రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ఎస్.రాహుల్ రెడ్డి సమాధానం ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని తెలిపారు.నిబంధనల ప్రకారం పాత పేరు మార్చి కొత్త సర్టిఫికెట్లు అందజేస్తామని హైకోర్టుకు నివేదించారని పాత పేరు మార్చుకున్న వారి సమాచారం కోసం హరి ఆశోక్ కుమార్ వివరించారు.

# ప్రతి ఒక్క రైస్ మిల్లర్లు ప్యాడిని దిగుమతులు చేసుకోవాలి

**జగిత్యాల :** ప్రస్తుత సీజన్ లో ప్రతి ఒక్క రైస్ మిల్లర్లు ప్యాడిని దిగుమతులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు.మంగళవారం రోజున కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రైస్ మిల్లర్ల తో సమావేశం నిర్వహించారు. ముందుగా రా రైస్ మిల్లర్లు, బాయిల్డ్ రైస్ మిల్లర్లు తమ యొక్క సమస్యలను కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రూల్స్ ప్రకారం 10% బ్యాంకు గ్యారంటీ రైస్ మిల్లు లకు యధావిధిగా వర్తిస్తుందని తెలిపారు. గతంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం లో భాగంగా వారు చెప్పిన రూల్స్ ప్రకారం బ్యాంకు గ్యారెంటి వర్తిస్తా యని తెలిపారు. అలాగే రైస్ మిల్లర్ గతంలో చెల్లించాల్సిన బకాయి బిల్లును చెల్లింపు చేస్తామని హామీ ఇచ్చారు. అందరి సహకారంతో ప్యాడి దిగుమతి కెపాసిటీ బట్టి మిల్లర్లు రైతులకు ప్రభుత్వానికి సహకరించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ బి. ఎస్.లత,డీసీవో డీఎంవో, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.